



# కరపత్రం

SINCE 2014

ఆదివారం ఆగస్ట్ 3 2025 సంపుటి :0 సంచిక :289 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలు..

### మోదీ స్ట్రాంగ్ కౌంటర్

వారణాసి: భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై భారత ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు.



## ఆ అణుబాంబును పేల్చనివ్వండి:

### రాహుల్‌కు రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్



# వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో

## భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం



దిల్లీ: దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు.

"ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్న పార్టీ కాంగ్రెస్. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించట్లేదు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది.

పేజి 2లో ▶



## కేసులు, కొట్లాటలు నాకు కొత్తేమి కాదు: మంత్రి కొండా సురేఖ



## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు.. మరో ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు



## కార్పొరేట్ స్థాయిలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు: మంత్రి పొంగులేటి

కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాలను నిర్మిస్తారు.



## సీఎం రేవంత్‌రెడ్డి 50సార్లు దిల్లీకి వెళ్లారు..

### రాష్ట్రానికి ఏం ప్రయోజనం?: కేటీఆర్



## దిల్లీలో రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



## ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు చేయొద్దు:

### డిప్యూటీ సీఎం భట్టి



కొల్లాపూర్: గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం వడ్డీలు కడుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదన్నారు. కనీసం గతంలో కాంగ్రెస్ శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను కూడా ఆ పార్టీ పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు."కృష్ణా నదిపై భారత రాష్ట్ర సమితి ఒక్క ప్రాజెక్టు కూడా ఎందుకు కట్టలేదు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ నిర్మించే ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయిన తర్వాత బనకచర్ల కట్టుకోవచ్చు.

పేజి 2లో ▶

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం ఆగస్ట్ 3 2025

# వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం

మొదటి పేజీ తరువాయి

భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు రాహుల్ కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయినప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భాగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాడతారు. భాజపాకు 150 సీట్లు దాటకుండా చూస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

సంపాదకీయం

## సిందూర్ విజయాలు, పాలకుల వైఫల్యాలు

పార్లమెంటు ఉభయ సభలలో గత వారం ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగింది. ఆ సైనిక చర్య లక్ష్యాలు నెరవేరాయని, తత్కారణంగా దాన్ని తుదకు (తాత్కాలికంగా) విరమించడం జరిగిందని, మన సైనిక కార్యకలాపాలు సాధారణమైన క్రమ పద్ధతికి వచ్చాయనే అభిప్రాయాన్ని ప్రభుత్వం కలిగించింది. పరిస్థితి నిజంగా అలా ఉన్నదా? లేదు. ప్రభుత్వం కలిగించిన అభిప్రాయం తప్పు. నిజమేమిటంటే మన సైన్యం ఒక కఠినమైన ఆట ఆడుతుండగా ప్రభుత్వం బలవంతంగా బంతిని లాక్కోవడం జరిగింది! మన సైనిక దళాల ధైర్య సాహసాలకు జేజేలు. ఆపరేషన్ సిందూర్ కొన్ని కట్టుకథలను బద్దలుగొట్టింది. అపోహలు, తప్పుడు నమ్మకాలను తొలగించింది. పాకిస్థాన్‌పై యుద్ధం, విజయ సాధన చాలా సులభంబీ సంప్రదాయ యుద్ధంలో భారత్ ఆధిక్యత చెక్కు చెదరకుండా కొనసాగుతుందిబీ భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా మిత్ర దేశాలు ఉన్నాయి, పాకిస్థాన్‌కు శ్రేయోభిలాషులు ఎవరూ లేరు మొదలైనవే ఆ కట్టుకథలు.

మన సైనిక దళాల నాయకత్వం విలక్షణరీతిలో వ్యవహరించింది. సైనిక చర్యలకు ఉదాహరణప్రాయంగా ఆపరేషన్ సిందూర్‌ను అవి నిర్వహించాయి. సైనిక కార్యాచరణ విషయంలో స్వేచ్ఛనివ్వాలని ప్రభుత్వాన్ని సైన్యం కోరింది. సైన్యం అభ్యర్థనను సర్కార్ అంగీకరించింది. సైనిక చర్యకు సంకల్పించింది, తొట్ట తొలుత రంగంలోకి దిగింది భారత సైన్యమే గనుక దానికి సహజంగానే ప్రారంభ సానుకూల ప్రయోజనాలు దక్కాయి: పాకిస్థాన్ భూభాగాలలోను, ఆక్రమిత కశ్మీర్‌లోను ఉన్న తొమ్మిది వేర్వేరు ఉగ్రవాద స్థావరాలపై కేవలం కొన్ని నిమిషాల వ్యవధిలో చేసిన దాడులు సంపూర్ణంగా విజయవంతమయ్యాయి. ఉగ్రవాద కార్యకలాపాల సదుపాయాలు, సాధనాలు సమస్తమూ ధ్వంసమైపోవడంతో పాటు పలువురు ఉగ్రవాదులు హతులయ్యారు. అయితే పాకిస్థాన్ సైనిక దళాలు త్వరితగతిన కోలుకున్నాయి. చైనాలో తయారైన యుద్ధ విమానాలు (జె%-10), చైనా ఉత్పత్తి చేసిన మిస్సైల్స్ (పి-15), తుర్కియే సరఫరా చేసిన డ్రోన్‌లతో మే 7-8 రాత్రి, పాకిస్థాన్ ప్రతిదాడులు నిర్వహించింది.

తమ వ్యూహ సంబంధిత లోపాలు, లొసుగులను మన సైనిక దళాల నాయకత్వం వెన్వెంటనే గుర్తించి, కొత్త యుద్ధ తంత్రంతో పాకిస్థాన్‌ను ఎదుర్కొన్నది. అదీ సరైన, సమర్థ నాయకత్వం. పునః ప్రారంభమైన సైనిక చర్యలు మే 9, 10 తేదీల్లో పాకిస్థాన్‌లోని 11 సైనిక వైమానిక స్థావరాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా సహజంగానే భారత సైన్యానికి కొన్ని నష్టాలు వాటిల్లాయి. అత్యున్నతస్థాయి సైనికాధికారులు ఈ వాస్తవాన్ని అంగీకరించారు. ఇది, సమర్థ నాయకత్వానికి మరొక ఉదాహరణ. మరి మన రాజకీయ నాయకత్వం కూడా సైనిక నాయకత్వం మాదిరిగా వ్యవహరించిందా? లేదు. తన తప్పులను అంగీకరించలేదు. నష్టాలు వాటిల్లినట్టు ఒప్పుకోలేదు (తలను ఇసుకలో దూర్చి తననెవరూ చూడటం లేదని భావించే) ఉష్ట్రపక్షిలా మన రాజకీయ నాయకత్వం వ్యవహరించింది. ఆపరేషన్ సిందూర్‌లో ఒక 'నిర్ణయాత్మక విజయం' సమకూరిందని పదే పదే ప్రకటించింది. నిజమేనా? నిర్ణయాత్మక విజయం సమకూరి ఉన్నట్టయితే తనకు సానుకూలంగా ఉన్న పరిస్థితులను మరిన్ని సైనిక విజయాల సాధనకు ఎందుకు ఉపయోగించుకోలేదు? పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి రాజకీయ రాయితీలను డిమాండ్ చేసి ఎందుకు పొందలేదు? పాకిస్థాన్ డీజీఎమ్‌ఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ఫోన్ చేసీ చేయగానే ఎందుకు సానుకూలంగా ప్రతిస్పందించారు? కాల్పుల విరమణకు షరతులు ఎందుకు విధించలేదు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు లేవు (యుద్ధంలో ఒక నిర్ణయాత్మక విజయానికి తిరుగులేని ఉదాహరణ డిసెంబర్ 16, 1971న పాకిస్థాన్ సైనికాధికారి జనరల్ నియాజీ భారత సైనికాధికారి జనరల్ అరోరాకు లొంగిపోవడం).ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నెలకొన్న ఒక వాస్తవాన్ని మన రాజకీయ నాయకత్వం అంగీకరించలేదు: పాకిస్థాన్, చైనాలు తమ సైనిక, రాజకీయ సంబంధాలను మరింతగా పటిష్ఠం చేసుకున్నాయి. పాకిస్థాన్‌కు కొత్త తరం యుద్ధ విమానాలు, మిస్సైల్స్‌ను చైనా సరఫరా చేస్తోంది. తాము ఉత్పత్తి చేసిన సైనిక సామగ్రి మన్నికను ఆపరేషన్ సిందూర్ సందర్భంగా చైనా పరీక్షించుకున్నది. బీజింగ్-ఇస్లామాబాద్ సైనిక బంధం ఆపరేషన్ సిందూర్‌లో స్పష్టంగా కనిపించింది. రాజకీయ రంగంలో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి 'ఉగ్రవాదంపై పాకిస్థాన్ నిశ్చయాత్మక చర్య'ను ప్రశంసించారు. పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లు భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసేందుకు చైనా సంపూర్ణ మద్దతునిచ్చింది.అమెరికాతో పాకిస్థాన్ (కనీసం పాకిస్థాన్ సైన్యం) బంధం మరింతగా దృఢతరమవడం మరొక వాస్తవం. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్‌ను అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో విందుకు ఆహ్వానించారు. దేశ సార్వభౌమాధినేత లేదా ప్రభుత్వాధినేత కాని వ్యక్తులకు మున్నెన్నడూ ఇటువంటి గౌరవం లభించలేదు. 'యుద్ధాన్ని కొనసాగించకుండా, ముగించినందుకు జనరల్ మునీర్‌కు ట్రంప్ కృతజ్ఞతలు చెప్పారు. తన విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్‌లు అంగీకరించాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ రెండు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే నివారించానని ట్రంప్ పదే పదే చెప్పుకున్నారు. ఆపరేషన్ సిందూర్ విషయమై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న ప్రతిపక్షాలను ప్రధానమంత్రి, హోం మంత్రి ఘాటుగా విమర్శించారే గానీ అమెరికా, చైనా అధ్యక్షులు, వారి విదేశాంగ మంత్రుల ప్రకటనలను ఖండించే సాహసం చేయలేకపోయారు.

## ఆ అణుబాంబును పేల్చనివ్వండి:

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం, భాజపాపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన తీవ్రవ్యాఖ్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఆ అణుబాంబును పేల్చనివ్వండని వ్యాఖ్యానించారు. "తనవద్ద అణుబాంబు ఉందని రాహుల్ గాంధీ అన్నారు. అయితే ఆయన దానిని వెంటనే పేల్చాలి. అది పేలేటప్పుడు దానివల్ల తనకు హాని కలగకుండా చూసుకోవాలి. గతంలో భూకంపం అంటూ హెచ్చరికలు చేశారు. కానీ తర్వాత అది తుస్సుమంది" అని కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగబద్ధమైన సంస్థ (ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి)పై ఇలాంటి ప్రకటనలు చేయడం ప్రతిపక్ష నేతకు తగదని మండిపడ్డారు.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. అనంతరం ముసాయిదా ఓటరు జాబితాను ఈసీ నేడు విడుదల చేసింది. అయితే, ఈ ప్రక్రియను ముందు నుంచీ వ్యతిరేకిస్తోన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్ర స్థాయి నుంచి ఓట్ల చౌర్యం జరుగుతోందని మేం ఎప్పటినుంచో అనుమానిస్తున్నాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రతో పాటు లోక్‌సభలో ఎన్నికల్లోనూ అక్రమాలు జరిగాయి. ఓటరు సవరణ చేపట్టి కోట్లాది మంది కొత్త ఓటర్లను అదనంగా చేరుస్తున్నారు. దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తే.. ఈసీ గురించి బయటపడింది. ఆరు నెలల పాటు మేం సొంతంగా దర్యాప్తు జరిపి ఆటం బాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ బాంబు పేలిన రోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు" అని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు.

మరో 15 సీట్లు రాకపోయుంటే మోదీ ప్రధాని కాకపోయేవారు: రాహుల్ గాంధీ

మరో సందర్భంలో దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని రాహుల్ అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. మరో 15 సీట్లు రాకపోయుంటే మోదీ ప్రధాని కాకపోయేవారని పేర్కొన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

## దిల్లీలో రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బీసీ జనాభా సేకరణను కాంగ్రెస్ గతంలో ఎందుకు చేయలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ప్రయత్నిస్తూనే ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక విధాలుగా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను పీఎం, సీఎంలను చేసిందా? అని ప్రశ్నించారు. నగరంలోని ఇందిరాపార్కు వద్ద భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ మోర్చా మహాధర్నాలో కిషన్ రెడ్డి మాట్లాడారు. "బీసీలకు జనాభా సేకరణ తర్వాతే సామాజిక న్యాయం జరుగుతుంది. దిల్లీలో అనేక రకాలుగా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి మాటలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే" అని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలు..

మొదటి పేజీ తరువాయి

అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు.

ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. "ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాల పైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. భారత్ కూడా అతిత్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారనుంది. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంబిగించాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలి" అని మోదీ పిలుపునిచ్చారు.

### భారత్‌ది డెడ్ ఎకానమీయా..? ఏఐ ఏం చెప్పిందంటే..!

ఇటీవల భారత్-రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థికవ్యవస్థలను దిగజార్చుకోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూదిల్లీపై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు. ఈనేపథ్యంలోనే మోదీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### 'సిందూర్'ను తమాషా అనడం సిగ్గుచేటు..

ఇక, ఇదే సమావేశంలో కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలపైనా ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. "కళ్లముందు అన్యాయం, ఉన్మాదం జరుగుతుంటే ఆ మహాదేవుడు తన రుద్రరూపాన్ని చూపిస్తాడు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత రుద్ర రూపాన్ని ప్రపంచం చూసింది. మనతో పెట్టుకుంటే పాతాళలోకంలో ఉన్నా వదిలిపెట్టబోమని రుజువు చేశాం. కానీ, సిందూర్ విజయం కొందరికి మింగుడుపడటం లేదు. పాక్ ఉగ్ర స్థావరాల ధ్వంసమైతే కాంగ్రెస్, దాని మిత్ర పార్టీలు కన్నీళ్లు పెట్టుకుంటున్నాయి. అందుకే మన భద్రతా దళాలను అవమానిస్తున్నాయి. అసలు ఆపరేషన్ పేరు కూడా వారికి సమస్యగా మారింది. 'సిందూర్'ను తమాషా అని ఎవరైనా అనగలరా? అలా అనడం నిజంగా సిగ్గుచేటు" ప్రధాని దుయ్యబట్టారు.

ఈ సందర్భంగా ఇటీవల జమ్మూకశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాదులను మట్టుబెట్టిన 'ఆపరేషన్ మహాదేవ్' గురించి కూడా మోదీ ప్రస్తావించారు. "ఆ మహాదేవుడి ఆశీస్సులతోనే పహల్గాంకు ప్రతీకారం తీర్చుకోగలిగాం. అయితే, కొందరు ఆ ఆపరేషన్ జరిగిన సమయాన్ని కూడా అనుమానిస్తున్నారు. దానికి నేనేం చేయగలను. ఉగ్రవాదులు దొరికినప్పుడు చంపకుండా వారాలు చూసుకోవాలా? లేదంటే వారు పారిపోయేందుకు అవకాశం ఇవ్వాలా?" అని మోదీ దుయ్యబట్టారు.

## సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు.. మరో ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఏ3.. విశాఖ సృష్టి కేంద్రం మేనేజర్ కల్యాణి, ఏ6.. ధనశ్రీ సంతోషి(అస్సాం)ను కస్టడీలోకి తీసుకున్నారు. ఉత్తర మండల డీసీపీ కార్యాలయానికి వారిని తరలించారు. ఇద్దరినీ 5 రోజుల కస్టడీకి ఇటీవల సికింద్రాబాద్ సివిల్ కోర్టు అనుమతించింది. వీరిని సరోగసీ వ్యవహారంలో పోలీసులు మరింత లోతుగా విచారించనున్నారు. అంతకుముందు ఈ ఇద్దరికి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు.

సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో పలువురు దంపతులను మోసం చేసి డబ్బులు దండుకున్నారు. ఏజెంట్ల సాయంతో అస్సాంకు చెందిన మహిళల నుంచి పిల్లలను కొనుగోలు చేసి తీసుకొచ్చి దంపతులకు వారి బిడ్డగా అప్పగించారు. మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా వీర్యం, అండాలు సేకరించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించారు.

## ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు చేయొద్దు:

మొదటి పేజీ తరువాయి

ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు ఏపీ మంత్రులు మాట్లాడకూడదు. తెలంగాణకు ద్రోహం చేసింది.. భారత రాష్ట్ర సమితి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లారు కాబట్టే బనకచర్ల ప్రాజెక్టు ఆగింది. ఏపీ మంత్రి లోకేశ్ తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయకూడదు. 2 లక్షల ఎకరాలు మునిగిపోకుండా పోలవరం కట్టుకోవచ్చు. ముంపు గ్రామాల ప్రజల తరఫున పోరాడేందుకు మేం సిద్ధంగా ఉన్నాం." అని అన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి 50సార్లు దిల్లీకి వెళ్లారు..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'ఎక్స్'లో ఒకటి నుంచి 50 వరకు అంకెలు వేసి.. ఇవి కేవలం సంఖ్యలు కావు సీఎం దిల్లీ పర్యటనల వివరాలు అని పేర్కొన్నారు. హస్తిన యాత్రలో రేవంత్‌రెడ్డి అర్ధశతకం సాధించారని ఎద్దేవా చేశారు. సీఎం దిల్లీ పర్యటనల వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం ఉందని ప్రశ్నించారు. "20 నెలల పదవీకాలంలో రేవంత్‌రెడ్డి 50 సార్లు దిల్లీకి వెళ్లారు. తెలంగాణకు సాధించిందేమీ లేదు.. ఉత్త మాటలు తప్ప. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. రాష్ట్రానికి పాలించే ముఖ్యమంత్రి కావాలి కానీ, దిల్లీ యాత్రలు చేసే టూరిస్టు సీఎం కాదు" అని అని కేటీఆర్ విమర్శించారు.

## కార్పొరేట్ స్థాయిలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు: మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నాలుగు జిల్లాల్లో 9 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. త్వరలో గచ్చిబౌలిలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ.. ప్రజలకు మరింత సమర్థంగా సేవలందించేందుకే మరో అడుగు ముందుకు వేస్తున్నట్లు వెల్లడించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త భవనాల నిర్మాణం ఉండాలి. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానం అనే అంశాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకోవాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. మిగిలినవన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలని భావిస్తున్నాం. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో 4 లేదా 5 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను అనుగుణంగా ఒకే చోట ఇంటిగ్రేట్ చేసేలా భవనాన్ని నిర్మించాలని నిర్ణయించాం. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలి. ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుంది. అవినీతిని కూడా తగ్గించవచ్చు" అని పొంగులేటి అన్నారు.

## కేసులు, కొట్లాటలు నాకు కొత్తేమి కాదు: మంత్రి కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తనపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దాఖలు చేసిన పరువునష్టం కేసులో నాంపల్లి కోర్టు ఆదేశాలపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఈ కేసుకు సంబంధించి కాగ్నిజెన్స్ తీసుకొని ముందుకు వెళ్లాలని నాంపల్లి కోర్టు స్పష్టం చేసిందన్నారు. "ఈ దేశ న్యాయ వ్యవస్థపై అపారమైన గౌరవం ఉంది. ఈ కేసులు, కొట్లాటలు నాకు కొత్తేమి కాదు. నా జీవితమే ఒక పోరాటం. ఏ కేసులోనైనా కోర్టు కాగ్నిజెన్స్ తీసుకోమని చెప్పడం సర్వసాధారణం. ఇది జరిగి రెండు రోజులైంది. అయితే, కొండా సురేఖ కేసులో సంచలనం.. బిగ్ బ్రేకింగ్.. అంటూ వార్తలు రాస్తున్నారు. ఈ విషయంలో కొందరి ఉత్సాహం చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యమేస్తోంది. కొండా సురేఖ పేరు వినగానే.. కొంతమంది రిపోర్టర్లు నా కేసులో కోర్టు తీర్పు ఇచ్చిందని మీడియా, సోషల్ మీడియాల్లో రాస్తున్నారు. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నా. చివరగా నేను చెప్పేది ఒకటే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని మంత్రి పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం ఆగస్ట్ 3 2025

## మీడియా ప్రతినిథులపై గంజాయి బ్యాచ్ హల్ చల్

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా బోడుప్పల్ లోని మేడిపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులపై గంజాయి మత్తులో ఉన్న గ్యాంగ్ శనివారం దాడికి యత్నించారు. మీడియా ప్రతినిథులు ఎదురు తిరగడంతో గంజాయి బ్యాచ్ తమ బైక్ లు వదిలి పరారయ్యారు. ప్రెస్ క్లబ్ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు గంజాయి బ్యాచ్ కోసం అన్వేషిస్తున్నారు.



## లిటిగేషన్లతో బతికే పరాన్న జీవులు

– గుండ్ల పోచంపల్లిలో తలెత్తిన పుట్టగొడుగులు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
గుండ్ల పోచంపల్లి మునిసిపల్ పరిధిలో చుట్టుపక్కల భూముల ధరలు పెరిగి నిర్మాణాలు ఊపందుకున్న విషయం అందరికీ తెలుసు.రియల్ ఎస్టేట్ డిమాండ్ పెరగడంతో కొందరు పరాన్న జీవులు లీగల్ లిటిగేషన్ లు సృష్టిస్తూ అక్రమ దారుల్లో డబ్బు సంపాదనకు దిగుతున్నారు.గుండ్ల పోచంపల్లి లోని ఒక స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని మునిసిపల్ కమిషనర్ గారికి ఒక వాట్సాప్ మెసేజ్ చేసి సంబంధిత స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారని తెలిసింది. గుండ్ల పోచంపల్లి లో ఈ స్థలానికి ఎటువంటి సంబంధం లేని ఒక లిటిగెంట్ మహేంద్ర వర్మ అనే వ్యక్తి ఏవో కేసు కాగితాలు పట్టుకొని, స్థల యజమానులను బెదిరించి డబ్బులు దండుకొనే వృత్తిలో ఉన్నట్టుగా స్పష్టంగా తెలుస్తున్నది.30 సంవత్సరాల క్రితం అమ్మిన భూమికి సంబంధించి, కొత్తగా పుట్టుకొచ్చిన యజమానుల మధ్య పార్టిషన్ జరగలేదని ఏదో సమస్య ఉందని, పసలేని సివిల్ కేసు నెంబర్ ఒకటి మునిసిపల్ కమిషనర్ గారికి పంపి స్థల యజమానులను మునిసిపల్ అధికారుల ద్వారా భయపెట్టి డబ్బులు దండుకోవాలనే చట్ట వ్యతిరేక వృత్తిని ఎన్నుకున్నట్టుగా స్పష్టమవుతున్నది.గుండ్ల పోచంపల్లి టిపిఓ ద్వారా ఈ విషయం తెలుసుకున్న స్థలం యజమానులు ఈ అక్రమార్కుడు మహేంద్ర వర్మపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడానికి




సమాయత్తమవుతున్నారని తెలిసింది. కోర్టును అడ్డం పెట్టుకొని లీగల్ గుండాలుగా అవతారమెత్తిన వారు గుండ్ల పోచంపల్లిలో కనిపిస్తారు. ఇటువంటి వారిపై సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి గుండ్ల పోచంపల్లిలో స్థల యజమానులు ఆలోచనలు చేస్తున్నట్టుగా తెలిసింది.

స్థలాలతో గాని, లీగల్ లిటిగేషన్లతో గాని సంబంధం లేకుండా మాటిమాటికి మునిసిపల్ కార్యాలయంలోకి వచ్చి ఈ సదరు మహేంద్ర వర్మ అనే వ్యక్తి అధికారుల వద్ద దర్పం చలాయిస్తూ, స్థలాల యజమానులకు వార్తలు చేరవేసి లిటిగేషన్ లోకి తల దూర్చే పనిలో ఉన్నాడని తెలిసింది.

కోర్టుల్లో ఎవరైనా ఏ కేసైనా వేసే అధికారం ప్రతి వ్యక్తికి ఉంది.

కేసు వేసినంత మాత్రాన ఏ విచారణ లేకుండా, కోర్టు విషయాన్ని పరిశీలించకుండా కోర్ట్ ఎలాంటి ఆర్డర్ జారీ చేయదు.స్థలంతో గాని, లిటిగేషన్ తో గాని, కేసుతో గాని ఎలాంటి సంబంధం లేకుండా తన ఫోన్ నెంబర్ తో మెసేజ్ లు పంపుతూ అధికారుల యొక్క విధుల పరిమితిని ఆసరాగా తీసుకుని బతుకుతున్నాడు.

స్థలాల యజమానులు పెట్టుబడులు పెట్టి కేసుల్లో ఇరుక్కోవాలని చూడరు.ఈ సున్నితత్వాన్ని ఒక అవకాశంగా మలచుకొని ఎదుటివారిని చులకనగా చూస్తూ మహేంద్ర వర్మ అనే వ్యక్తి గుండ్లపోచంపల్లిలో ఒక సమస్యాత్మక వ్యక్తిగా అవతారమెత్తి లిటిగేషన్ల స్వయం ఉపాధి సృష్టించుకున్నాడు. ఇతను పంపిన వాట్సప్ మెసేజ్ అందుకున్న భూమి యజమానులు మీడియాకు ఈ విషయం తెలియజేశారు.కేసు వేసిన వ్యక్తి పేరు పక్కన తన ఫోన్ నెంబరు వ్రాసి అధికారులకు మెసేజ్ లు పంపి లిటిగేషన్ వీరుడిగా కనిపించి డబ్బులు దండుకునే ఒక మెలకువను కనుక్కున్నాడు.కేసు వేసిన వ్యక్తి తన పేరు తో పాటు ఫోన్ నంబర్ పంపవచ్చు. కానీ స్థలంతో ఎలాంటి సంబంధం లేని ఈ వ్యక్తి తన ఫోన్ నెంబర్ పంపడం ఒక కుట్ర అని స్థల యజమాని వై.శ్రీకాంత్ మీడియాకు తెలిపారు.కేసుతో సంబంధంలేని ఈ వ్యక్తి మహేంద్ర వర్మ తన ఫోన్ నెంబరు వ్రాసి అధికారుల ద్వారా స్థలాల యజమానుల సమస్యలో మధ్యవర్తిగా దూరి రాజీ కుదిర్చి డబ్బులు సంపాదించుకునే పనిలో, అక్రమార్కుడిగా మారి శాంతి భద్రతల సమస్య సృష్టించకముందే ఇతనిపై పోలీసులు, జిల్లా కలెక్టర్ కార్యాలయము తగిన దృష్టి పెట్టాలని గుండ్లపోచంపల్లి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రియురాలితో కలిసి దొరికిన భర్త



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
నార్సింగ్ పీఎస్ పరిధిలోని గంధంగూడలో వివాహేతర సంబంధం కలిగిన వ్యక్తి అడ్డంగా బుక్కయ్యాడు. వేణు కుమార్ అనే వ్యక్తి, తన భార్యకు తెలియకుండా మౌనిక అనే మహిళతో కలిసి జీవిస్తున్నాడన్న సమాచారం కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో బాధిత భార్య, తన బంధువులతో అక్కడకు చేరుకుని వేణును నిలదీశారు. అనంతరం ప్రియురాలితో కలిసి ఉన్న వేణు, మౌనికలిద్దరికి గ్రామస్థులు దేహశుద్ధి చేసి, నార్సింగి పోలీసులకు అప్పగించారు. తాను అన్యాయానికి గురయ్యానంటూ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు పోరాటం కొనసాగుతుంది

– బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు బీసీ సంఘం పోరాటం నిలకడగా కొనసాగుతుందని రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ హక్కుల కోసం ఇందిరా పార్క్ వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టనున్న 72 గంటల నిరాహార దీక్షకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

### ఇన్నాళ్లుగా బీసీలకు అన్యాయమే

స్వాతంత్ర్యానంతర కాలం నుంచి బీసీలపై అన్యాయం కొనసాగుతోందని హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు బీసీలకు న్యాయం చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ల అమలు విషయంలో పాలకపక్షాలు గోపుర దర్శనంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

### మండల్ కమిషన్‌ను అడ్డుకున్న బీజేపీ

### బహిర్గతం చేయని కాంగ్రెస్

కాకా కాలేల్కర్, మండల్ కమిషన్ల నివేదికలను బహిర్గతం చేయకుండా బీసీలను నిస్సహాయులుగా మార్చిన బాధ్యత కాంగ్రెస్‌దని, మరోవైపు మండల్ కమిషన్ అమలుకు వ్యతిరేకంగా బీజేపీ కమాండల్ ఉద్యమాన్ని నడిపిందని ధ్వజమెత్తారు. బీసీల ఎదుగుదలకు ఇరుపార్టీలూ మూలంగా మారాయని ఆరోపించారు.

### రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు

ప్రస్తుతం అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి డిల్లీ పర్యటనల్లో ఒక్కసారి కూడా బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించలేదని, మూడు రోజులు కాదు అవసరమైతే మూడు నెలలైనా డిల్లీలో ఉండి పోరాడాలని హరిప్రసాద్ సూచించారు. తమిళనాడులో జయలలిత బీసీల కోసం చేసిన పోరాటం ఆదర్శంగా నిలవాలన్నారు.

### కవిత దీక్షకు ఆహ్వానం బీసీలు తరలిరావాలి

ఎమ్మెల్సీ కవిత 72 గంటల నిరాహార దీక్షకు దిగుతున్న విషయాన్ని హర్షిస్తూ, బీసీల హక్కుల సాధనకు ఇది మైలురాయిగా నిలుస్తుందని హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆగస్టు 4 నుంచి 6 వరకు జరిగే ఈ దీక్షకు ప్రతి బీసీ బిడ్డ భాగస్వామిగా ఉండాలని పిలుపునిచ్చారు.



### యుపిఎఫ్ కన్వీనర్ కుమారస్వామి వ్యాఖ్యలు

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడం కోసం ఈ దీక్షకు సన్నద్ధమవుతున్నారని యుపిఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ కుమారస్వామి తెలిపారు. బీసీలకు రాజకీయాధికారంలో ప్రాధాన్యం కల్పించేందుకు ఈ ఉద్యమం కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.కనకయ్య, శ్రీనివాస్, కలర్ సత్తన్న, తూల భాస్కర్ రావు, పర్శరం గౌడ్, అనీల్ యాదవ్, పుదరి రాజేశ్వరి గౌడ్, శివరాణి, సంధ్యరాణి, మేకల అంజనేయులు, రత్నాకర్, రాజీ తదితరులు పాల్గొన్నారు.

## సమయానుకూలంగా బస్సులు నడపాలి



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**
సమయానుకూలంగా బస్సులు నడపాలని కథలాపూర్ మండలంలోని గంభీర్ పూర్, తంగ్రడియాలకు చెందిన పలువురు నాయకులు, ప్రయాణీకులు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి జలంధర్ మాట్లాడుతూ సమయానుకూలంగా బస్సులు నడపకపోవడం వల్ల కోరుట్ల, కథలాపూర్ మండల కేంద్రాల్లో విద్యనభ్యసించే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగా మహాలక్ష్మి బస్సును రెండో బస్సుగా నడపాలని కోరారు.

## మెట్‌పల్లి సివిల్ హాస్పిటల్లో పేషెంట్లకు అన్న వితరణ



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్‌పల్లి లయన్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం లయన్స్ క్లబ్ కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్ పుట్టినరోజు పురస్కరించుకొని మెట్‌పల్లి సివిల్ హాస్పిటల్లో వచ్చిన పేషెంట్లకు, కుటుంబ సభ్యులకు అన్న వితరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్మల శ్రీనివాసరావు, కార్యదర్శి జైపాల్ రెడ్డి, కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్, జెడ్ సి పోలీస్ శ్రీనివాస్, ఇల్లెందుల శ్రీనివాస్, మర్రి భాస్కర్, నాంపల్లి వేణుగోపాల్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘ భవనానికి నిధులు కేటాయించాలి

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
బీజేపీ రాష్ట్ర నాయకులు డా. రఘు ని మెట్‌పల్లి మున్నూరు కాపు సంఘ సభ్యులు శనివారం కలిశారు. ఎంపీ ధర్మపురి అరవింద్ నిధుల నుండి వారి సంఘం భవన నిర్మాణం కోసం కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర నాయకులు రఘు ని మున్నూరు కాపు సంఘ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బోడ్ల రమేష్, జిల్లా నాయకులు శ్రీకర్ గౌడ్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తల్లిపాల దినోత్సవం

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**
కథలాపూర్ మండలంలోని పోతారం, చింతకుంట, తాండ్రియ్యాల, పోసానిపెట్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు జరిపారు. గర్భిణులకు, తల్లులకు పౌష్టికహారాన్ని అందించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్ వైజర్ స్రవంతి మాట్లాడుతూ తల్లిపాల ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబటి స్వరూప, ఉయ్యాల పద్మ, ఆశా వర్కర్ మమత, తల్లులు బోడ మధు శ్రీ, సళ్ళం లాస్య, రాస నిఖిల, శ్వేత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



## మెట్‌పల్లిలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మెట్‌పల్లి గవర్నమెంట్ హాస్పిటల్, ప్రైవేట్ హాస్పిటల్స్ లో శనివారం ఎసిడిఎస్ సూపర్వైజర్స్ శోభారాణి విజిట్ శనివారం చేయడం జరిగింది. డెలివరీ అయిన తల్లులందరికీ ముర్రుపాలపై, తల్లిపాలపై అవగాహన ఇవ్వడం జరిగింది. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాగా పనిచేస్తాయని, తల్లిపాలు ఇవ్వడం వలన రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు.




## సిద్ధార్థ విద్యాలయంలో ఫుడ్ ఫెస్టివల్

**భిక్నూర్ ఆగష్టు 02 కరపత్రం ప్రతినిధి**
మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయం హైస్కూల్లో శనివారం ఉదయం 10:30 నుండి 12:00 గంటల సమయంలో 6 నుండి 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులు వారి వారి తల్లిదండ్రుల సహకారంతో 60 రకాల పలు వంటకాలు చేసి పాఠశాల ఆవరణలో ప్రత్యేక ప్రదర్శన చేసి వంటకాల తయారీ విధానం, వాటిలో ఉండే పోషకాల గురించి వివరించారు. జంకు ఫుడ్ వల్ల కలిగే దుష్ఫలితాల గురించి ప్రత్యేకంగా తెలియపరిచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ బండి సుధాకర్ ప్రిన్సిపాల్ లింగాల శ్రీకాంత్ గౌడ్ మరియు సీనియర్ టీచర్స్ మోహన్ గౌడ్, రవి,బాబు, వాసంతి, కల్పన, భాస్కర్, సర్దార్, శైలజ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

## నూతనంగా ఏపీఎంగా సాయిలు



**భిక్నూర్ ఆగష్టు 02 కరపత్రం ప్రతినిధి**
మండల కేంద్రంలోని స్థానిక సమైక్య ఏపీఎంగా సాయిలు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన శ్రీనివాసును దోమకొండ మండలానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజంపేట మండలంలో పనిచేస్తున్న సాయిలును నియమించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మహిళా సమైక్య ప్రతినిధులు ఆయనను అభినందించారు. మహిళా సమాఖ్య అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
ఆదివారం ఆగస్ట్ 3 2025

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జ్

– చిన్నపిల్లలకు ప్రమాదకరమైన గదులలో పాఠ్య బోధన ఎట్లాలిప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కరువులితగు చర్యలకుజిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మెదక్ జిల్లాకు నివేదిస్తా
– ఎం.హేమలత, జూనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్





**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మీదకు నర్సాపూర్**
మెదక్ జిల్లా నర్సాపూర్ తాలూకా కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న చిన్నారి విద్యార్థులు బాత్రూం వసతి లేక ఇబ్బంది పడుతూ ఇటీవల ఇద్దరు చిన్నపిల్లలు బాత్రూం కోసం కోర్టు సమీపంలో ఉన్న కులాయి (నల్ల) దగ్గరికి వచ్చి విపరీత వర్షం కారణంగా, కోతుల కారణంగా ఇద్దరు చిన్నారులు భయభ్రాంతులకు గురై వర్షంలో తడుస్తూ ఏడుస్తూ కేకలు వేయడంతో కోర్టు సిబ్బంది గమనించి వారిని చిన్నారులను ప్రస్తుతం చేర తీయడంతో, పూర్తిగా తడిసిపోయి ఏడుస్తున్న ఆ చిన్నారి విద్యార్థులను చూసి న్యాయమూర్తి తక్షణమే తడిసిపోయి ఉన్న ఆ చిన్నారులకు కొత్త బట్టలు తెప్పించి వారికి సిబ్బందితో వేయించడం జరిగింది , మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారని చిన్నారు విద్యార్థులను న్యాయమూర్తి ప్రశ్నించగా చిన్నారి విద్యార్థులు బదులిస్తూ బాత్రూం వస్తుందంటే మమ్ములను బాత్రూం లేదని టీచర్లు చాలాసార్లు నన్ను మా తమ్ముని పంపించారని పిల్లలు చెప్పడం జరిగింది, తక్షణమే సంబంధిత స్కూల్ సిబ్బందిని పిలిపించి, పట్టించుకోకుండా బయటికి బాత్రూం కోసం ఎందుకు పంపుతున్నారని వారికి ఏదైనా అయితే ఎలా అని వివరణ కోరగా సంబంధిత స్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం, ఉపాధ్యాయులు మౌలిక వసతులు లేవని, పిల్లలను పంపలేద వివరణ ఇవ్వడం జరిగింది, ఇట్టి విషయమై న్యాయమూర్తి ఎం. హేమలత, ప్రత్యక్షంగా తేదీ 02 ఆగస్టు 2025 రోజున జిల్లా ప్రాథమిక పాఠశాల నర్సాపూర్ ను సందర్శించి పరిశీలన చేసి పాడుబడ్డ ప్రమాదకర తరగతి గదుల లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉదంతాన్ని న్యాయమూర్తి ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగింది, పలు మౌలిక వసతుల పై ప్రధానోపాధ్యాయులను ఉపాధ్యాయులను వివరణ కోరుతూ పాడుబడ్డ తరగతి గదులలో విద్యాబోధన ఎందుకు నిర్వహిస్తున్నారు, ప్రమాదవశాత్తు పై నుండి స్లాబ్ పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయి పడుతుంది కదా, పిల్లలకు ప్రమాదం వాటిల్లితే ఎట్లా? మీరు ఉన్నతాధికారులకు నివేదించారా లేదా? ఇట్టి విషయంపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా చైర్మన్ న్యాయ సేవా అధికార సంస్థ మెదక్ జిల్లా, జిల్లా కార్యదర్శి న్యాయ సేవ అధికార సంస్థ మెదక్ జిల్లా వారికి తగు చర్యల నిమిత్తం నివేదిస్తా అన్నారు, అనంతరం చిన్నపిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లల పట్ల అలసత్వం వహిస్తే చట్టరీత్యా ఉపేక్షించేది లేదు అన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు ప్రమాదం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను కూడా సందర్శించి తరగతి గదులను పరిశీలించడం జరిగింది, ఉపాధ్యాయులను వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది, పాఠశాల సందర్శనలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది,

## మేడిపల్లి ఉపరితల గనిని సందర్శించిన టీజీఎస్ఎన్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్



కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి
మేడిపల్లి ఉపరితల గనిని తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్ఎన్పీడీసీఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డి శనివారం సందర్శించారు. మేడిపల్లి ఉపరితల గని వద్ద నిర్మించనున్న పంపుడ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కు సంబంధించి అర్జీ.1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ తో కలిసి మేడిపల్లి ఉపరితల గని వ్యూపాయింట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కు సంబంధించిన మ్యాపులను పరిశీలించారు. ప్రాజెక్ట్ కు సంబంధించిన వివరాలను జిఎం ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ తరలింపు, ఖర్చు, గ్రిడ్ కనెక్టివిటీకి సంబంధించి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జిఎం ఆంజనేయ ప్రసాద్, ఏరియా ఇంజనీర్ ఇన్‌ఛార్జ్ జితేందర్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, వీరారెడ్డి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, మేనేజర్ మల్లిఖార్జున్ యాదవ్, టీజీఎస్ఎన్పీడీసీఎల్ అధికారులు గంగాధర్ ఎస్.ఈ ఆపరేషన్ పెద్దపల్లి, వెంకటేశ్వర్లు. ఏడీఈ ఆపరేషన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జవాన్, కిసాన్ కే బిజెపి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత...

– పీఎం కిసాన్ నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేసిన శంకరపట్నం బిజెపి నేతలు...




**కరపత్రం ప్రతినిధి శంకరపట్నం ఆగస్టు 2**
దేశానికి రక్షణగా ఉండే జవాన్ కు దేశానికి అన్నం పెట్టే కిసాన్ కి బిజెపి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని బిజెపి మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అన్నారు. శనివారం 20 వ విడత పీఎం కిసాన్ నిధులు విడుదల చేసి రైతుల ఖాతాలలో జమ చేసినందన వారణాసి నుండి భారత ప్రధాని నరేంద్ర మోడీ రైతులను ఉద్దేశించి ప్రసంగించగా కేశవపట్నంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం పాటుపడుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పీఎం కిసాన్ నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రైతులకు బిజెపి నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేష్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు దాసారపు నరేందర్, కొయ్యడ అశోక్, రాసమల్ల శ్రీనివాస్, కనకం సాగర్, మందాడి జగ్గారెడ్డి, బిజిలి సారయ్య, పడాల వెంకటలక్ష్మి, గూళ్ళ రాజు, బొజ్జ సాయి ప్రకాష్, రమణ రెడ్డిలతో పాటు ఏఇఓలు, వివిధ గ్రామాల రైతులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పొలంబాట





కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి
గోదావరిఖని కృష్ణవేణి పాఠశాల (అడ్డగుంటపల్లి) మంజుల శ్రీనివాస్ రెడ్డి ప్రోత్సాహంతో పాఠశాల విద్యార్థులలో వ్యవసాయంపై అవగాహన పెంచే లక్ష్యంతో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు మేడిపల్లి సెంటర్ సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి వీక్షించి నారు నాటు ప్రక్రియను ప్రత్యక్షంగా చూశారు. రైతుల సహకారంతో విద్యార్థులు నారు నాటే ప్రక్రియలో స్వయంగా పాల్గొనడం ద్వారా వ్యవసాయ పద్ధతులపై నిజమైన అవగాహన పొందారు. గ్రామీణ జీవనశైలి, ప్రకృతి సమీక్ష, సంప్రదాయ పద్ధతులపై పిల్లలు ఆసక్తికరంగా గమనించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు టీచర్లు సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి గ్రామీణ మూల్యాలను అందించాలనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కార్మికులను సన్మానించిన తిరుమల్ మల్లన్న బీసీ జేపీసీ టీం ఇంచార్జ్ రవి పటేల్




**కరపత్రం ప్రతినిధి భూపాలపల్లి ఆగస్టు 2**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో భూపాలపల్లి మునిసిపాలిటీ అవుట్సోర్సింగ్ కార్మికుల ఎన్నికలు జరిగాయి ఈ యొక్క ఎన్నికలలో గెలుపొందిన అధ్యక్షులు సంకటి సదానందం ఉపాధ్యక్షులు కల్లేపల్లి తిరుపతి చీఫ్ సెక్రటరీ నంగావత్ రాజేందర్ జాయింట్ సెక్రెటరీ బండి రాజబాబు గౌరవ అధ్యక్షులు బండారి బాబు గౌరవ అధ్యక్షులు నన్నెపు ప్రకాష్ మహిళా సభ్యులు అల్లూరి మంజుల ఏకు సునీత నియమితులయ్యారు వీరందరిని తీన్మార్ మల్లన్న బీసీ జేపీసీ టీం జిల్లా ఇంచార్జ్ రవి పటేల్ శాలువాతో సత్కరించి గెలుపొందిన అభ్యర్థులను అభినందించారు తోటి కార్మికుల అభ్యున్నతి కోసం పనిచేసుకుంటూ ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించాలని తీన్మార్ మల్లన్న టీం మీ తోటి ఎల్లవేళలా ఉంటుందని కార్మికులకు అండగా వారి సమస్యల కోసం బీసీ జేపీసీ కృషి చేస్తుందని రవి పటేల్ హామీ ఇచ్చారు భూపాలపల్లి మున్సిపాలిటీలో రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ ఎన్నిక జరుగుతుంది గెలిచినవారు ఓడినవారు సమన్వయంతో పనిచేస్తూ ఈరోజు ఓటమి రేపటి గెలుపుకు నాంది అని రవి పటేల్ అందరికీ అభినందనలు తెలియజేశారు

## పీఎం కిసాన్ 20వ విడత విడుదల కార్యక్రమం



**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), ఆగస్టు 2:**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి నుండి, దేశవ్యాప్తంగా రైతులకు లబ్ధి చేకూర్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడతను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడిపల్లి రైతు వేదిక రామగుండం మండలంలోని రైతు వేదిక కేంద్రంగా రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. రైతులకు ప్రత్యక్షంగా నిధులు అందే విధంగా ఈ పథకం అమలవుతోంది. కేంద్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం చేపడుతున్న ఇతర ముఖ్య కార్యక్రమాల గురించి వివరించారు. ఎఫ్‌పీవో స్థాపన ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయాలను తెలిపారు.ప్రధాన్ మంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన%-%రైతులకు పింఛన్ హామీ, సాయిల్ హెల్త్ కార్డులు%-%నేల బలానికి అనుగుణంగా పంటలు వేసే అవగాహన కల్పించారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం, జల శక్తి అభియాన్ ద్వారా సాగునీటి వనరుల అభివృద్ధి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ప్రధానమంత్రి ప్రసంగాన్ని ఎంతో ఆసక్తిగా వీక్షించి, ప్రభుత్వ పథకాలపై అభినందనలు తెలిపారు. రైతుల సంక్షేమమే దేశ అభివృద్ధికి మూల స్తంభమని ప్రధాని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, కె. ప్రకాష్, వ్యవసాయ విస్తరణ అధికారి కే.శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా పలు చర్యలు.. మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట:ఆగస్టు 02**



Before




జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో గల లోతట్టు ప్రాంతాలు హౌసింగ్ బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, కృష్ణ కాలనీ లాంటి పలు కాలనీలలో నీటి ఉధృతి పెరిగినప్పుడు ఏర్పడ్డ చెత్తను 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం ముందస్తుగా చెత్తను తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ జమ్మికుంట – ఆబాదీ జమ్మికుంట పోయే మార్గంలో గల రోడ్ డ్యాము మత్వాడి కాల్వ ను చెట్ల పొదలు తొలిగించి శుభ్రం చేయడం జరిగినది. గతంలో ఏర్పడ్డ చెత్త వల్ల లోతట్టు ప్రాంతాలకు అధిక వర్షం వచ్చినప్పుడు చాలా ఇండ్లు నీట మునుగుతున్నాయని ఆయన అన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని అందులోని చెత్తను తొలగించే పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నీరు చేరకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ ఈ లు నరేష్ , వికాస్ ,ఈ ఈ శ్రీకాంత్ , సానిటరీ ఇనస్పెక్టర్ సదానందం , ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.